ట్యాంక్‌బండ్‌పై రణరంగం

- ఉద్రిక్తంగా మారిన చలో ట్యాంక్ బండ్
- పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు, తోపులాటలు
- బాష్పవాయుగోళాల ప్రయోగం
- ఏడుగురు పోలీసులు, పలువురు కార్మికులకు గాయాలు
- క్షతగాత్రుల్లో అదనపు ఎస్పీ.... సాయంత్రం వరకు కొనసాగిన ఆందోళన

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఆర్టీసీ కార్మికులు శనివారం చేపట్టిన చలో ట్యాంక్‌బండ్ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. రాళ్లదాడి, లాఠీఛార్జ్‌కు దారితీసింది. పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వగా పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. ఈ ఘర్షణలో అదనపు ఎస్పీ సహా ఏడుగురు పోలీసులకు, పదుల సంఖ్యలో కార్మికులకు గాయాలయ్యాయి. నిరవధిక సమ్మెలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది హైదరాబాద్‌కు చేరుకున్నారు. ట్యాంక్‌బండ్‌వద్ద బారికేడ్లను ఛేదించేందుకు వారు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది.ఆందోళనకారులను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పినా ఫలితం లేకపోవడంతో బాష్పవాయుగోళాలను ప్రయోగించారు. పోలీసులు ఆందోళనకారుల మధ్య దాదాపు మూడు గంటల పాటు జరిగిన తోపులాట రణరంగాన్ని తలపించింది. ఈ ఘర్షణల్లో అటు పోలీసులకు, ఇటు కార్మికుల కు గాయాలయ్యాయి. వందల సంఖ్యలో ఆందోళనకారులను పోలీసులు ఒకవైపు అరెస్టు చేస్తుంటే మరో పక్క పెద్దసంఖ్యలో ఆందోళనకారులు చేరుకున్నారు. ట్యాంక్‌బండ్‌చుట్టూ పోలీసు బృందాలు నిఘాను మరింత ముమ్మరం చేసి పరిసరాలలోకి ఎవరూ రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసుల బందోబస్తును ఎప్పటికప్పుడు పసిగడుతున్న ఆందోళనకారులు గుట్టు చప్పుడు కాకుండా ట్యాంక్‌బండ్ పరిసరాలలోకి చేరుకున్నారు.

రాళ్లు రువ్విన ఆందోళనకారులు.. లాఠీఛార్జ్

ఆందోళనకారులను అదుపు చేసేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో ముందుగా రాణిగంజ్ వైపు బందోబస్తులోఉన్న పోలీసులు లాఠీలకు పని చెప్పారు. ఈ విషయం లిబర్టీ, ఇందిరాపార్క్ ప్రాంతంలో బారికేడ్ల వద్ద పోలీసులతో తోపులాట జరుపుతున్న ఆందోళనకారులకు తెలియడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. దీంతో లిబర్టీ, ఇందిరాపార్క్ రహదారిలోనూ పోలీసులు లాఠీలకు పని చెప్పారు. రెచ్చిపోయిన ఆందోళనకారులు పోలీసులపై రాళ్ళు రువ్వడం ప్రారంభించారు. ఒకదశలో పోలీసులు రాళ్ళ దాడిని తట్టుకోలేక కొంత వెనక్కు తగ్గారు. పరిస్థితి అదుపు తప్పుతుందని గ్రహించిన అధికారులు వెంటనే అదనపు బలగాలను రంగంలోకి దింపి బారికేడ్లను ఛేదించేందుకు ప్రయత్నిస్తున్న వారిని నిలువరించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ పరిస్థితి కొలిక్కి రాకపోవడంతో లిబర్టీ వైపున ఉన్న ఆందోళనకారులపై బాష్పవాయుగోళాలను ప్రయోగించారు. పోలీసులపై రాళ్ళు రువ్వడం వల్ల అదనపు ఎస్పీతో పాటు మొత్తం ఏడుగురు పోలీసులు గాయాలపాలయ్యారు. పోలీసుల లాఠీ చార్జీలో పదుల సంఖ్యలో ఆందోళనకారులు గాయాలపాలయ్యారు. .

అరెస్టుల పర్వం

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌నుంచి ట్యాంక్‌బండ్ వైపు వస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, గాయకురాలు విమలక్కలను పోలీసులు ఇందిరాపార్క్‌వద్ద అరెస్టు చేశారు. హిమాయత్‌నగర్ నుంచి దూసుకు వస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకటరెడ్డి, సహ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, టీజేఎస్ నేత ప్రొఫెసర్ కోదండరాం తదితరులను లిబర్టీ వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆబిడ్స్ పోలీసుస్టేషన్‌కు, గోషామహల్‌లోని పోలీసుస్టేడియంకు తరలించారు. వైస్రాయ్ హోటల్ వైపు నుంచి ట్యాంక్‌బండ్‌పైకి వచ్చేందుకు ప్రయత్నించిన బీజేపీ ఎంఎల్సీ ఎన్. రాంచందర్‌రావు తదితరులను అదుపు లోకి తీసుకున్న పోలీసులు గాంధీనగర్ పోలీసుస్టేషన్‌కు తర లించారు. బన్సిలాల్‌పేట వద్ద కాంగ్రెస్ సీనియర్ నేత వీ హను మంతరావును అదుపులోకి తీసుకున్నారు.

బైక్‌పై వచ్చిన ఎంపీ సంజయ్

ట్యాంక్‌బండ్‌పై ఎట్టి పరిస్థితులలోకి వెళ్ళాలన్న సంకల్పంతో కరీంనగర్‌ఎంపీ బండి సంజయ్ పోలీసుల కళ్ళు గప్పి బారికేడ్ల వద్దకు చేరుకున్నారు. హెల్మెట్ ధరించి బైక్‌పై బారికేడ్ల వద్దకు వచ్చిన సంజయ్ ు, వాటిని తొలగించి వెళ్ళేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా సంజయ్ అనుచరులపై పోలీసులు లాఠీ చార్జీ చేసి చెదరగొట్టి ఎంపీని అరెస్టు చేసి ఆబిడ్స్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

గృహ నిర్బంధంలో పలువురు నేతలు

ట్యాంక్‌బండ్ పైకి నేతలు, కార్యకర్తలెవరూ రాకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించిన పోలీసులు పలువురు నేతలను శనివారం తెల్లవారుజాము నుంచే గృహ నిర్బంధం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్‌కె. లక్ష్మణ్‌ను చిక్కడపల్లిలోని ఆయన నివాసంలో, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డిని నందగిరిహిల్స్‌లోని ఆయన నివాసంలో, మాజీ మంత్రి డీకే అరుణను జూబ్లీహిల్స్‌లోని నివాసంలో, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌ను బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలును బేగంపేటలోని ఆయన నివాసంలోనే నిర్బంధించారు.

మావోలతో కుమ్మక్కు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆందోళనకారులపై హైదరాబాద్ పోలీసు కమిషనర్ అంజనీకు మార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టు సంఘాల నేతలతో ఆర్టీసీ కార్మికులు చేతులు కలిపి విధ్వంస చర్యలకు పాల్పడుతున్నారని సీపీ అన్నారు. ఆర్టీసీ కార్మికులకు మావోయిస్టు అనుబంధ సంఘాలతో సంబంధం ఉన్నందునే చలో ట్యాంక్‌బండ్‌కు అనుమతి ఇవ్వలేదని అంజనీకుమార్ వివరించారు. ఈ ఘటనలో ఏడుగురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని వెల్లడించారు. దాడిలో అదనపు డీసీపీ రామచంద్రరావు, ఏసీపీ రత్నాకి కూడా గాయాలయ్యాయని సీపీ తెలిపారు. దాడిచేసినవారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో టియర్ గ్యాస్ ప్రయోగించినట్లు తెలిపారు. లాఠీచార్జ్ చేయడంతో పోలీసులపై కొంతమంది ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. దీనిపై సీపీ స్పందించారు.

ప్రజారవాణా మెరుగుదలకు చర్యలు చేపట్టండి

- హైకోర్టు సందేహాలు నివృత్తి చేయండి
- ఆర్టీసీ విభజనపై కేంద్రంతో చర్చలు
- అధికారులతో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్: ఆర్టీసీ సమ్మె, సంస్థ మనుగడ, ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రత్యామ్నాయ విధానంపై సోమవారం హైకోర్టు విచారణ జరపనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మరోసారి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శనివారం ప్రగతి భవన్‌లో రవాణా, ఆర్టీసీ, న్యాయ నిపుణులతో సమీక్షించా రు. ఆర్టీసీ పునరుద్ధరణకు అడ్డొస్తున్న అన్ని అంశాలపై లోతుగా సమాలోచనలు జరిపారు. ఇటు హైకోర్టు సందేహాలను నివృత్తి చేస్తూ ప్రజా రవాణా వ్యవస్థ పునరుద్ధరణ చర్యలను వివరించేందుకు అధికారులు స్పష్టమైన నివేదికను రూపొందించి అందజేయాలని ఆదేశించారు. అదే విధంగా 9వ షెడ్యూల్ ప్రకారం ఏవిధంగా ఆర్టీసీ విభజనను పూర్తి చేయాలన్న కోణంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని సూచించారు. అలాగే పొరుగు రాష్ట్రం రవాణాశాఖ అధికారులతోనూ చర్చించి సాధ్యమైనంత త్వరగా విభజన ప్రక్రియను పూర్తిచేస్తే తప్ప సంస్థ ప్రక్షాళనకు ముందడుగు వేయలేమని సీఎం ఉన్నతాధికారులతో స్పష్టంచేశారు. సమ్మె రాజకీయ రంగు పులుముకుంటూ రోజురోజుకు ప్రభుత్వాన్ని సవాల్ చేసే విధంగా మారుతున్న నేపథ్యంలో ఎలాంటి వ్యూహాన్ని అవలంభించాలన్న అంశంపైనా చర్చించారు. తాజాగా శనివారం ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు జరిగిన చలో ట్యాంక్‌బండ్ కార్యక్రమం ఉద్రిక్త పరిస్థితులపై ఆరా తీశారు. ఎన్ని రకాలుగా సమ్మె జరుగుతున్నప్పటికీ ఆ ప్రభావం ప్రజా రవాణా వ్యవస్థపై ఏమాత్రం ఉండకుండా చూడాలని, ఎక్కడా బస్సు సర్వీసులు తగ్గించే ప్రసక్తే ఉండదని రవాణాశాఖ అధికారులను సీఎం ఆదేశించారు.

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి

మంత్రి ఎర్రబెల్లి ఎమ్మెల్యే బాల్కసుమన్ ఫేటీ

చెన్నూరు, ప్రభన్యూస్: చెన్నూరు నియోజవర్గంలో రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీ రాజ్ శాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, చెన్నూరు శాసనసభ్యులు బాల్క సుమన్ రాష్ట్ర పంచా యతీ రాజ్ శాఖ మాత్యులు ఎర్రబెల్లి దయాకర్ రావును కోరారు. శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే సుమన్ పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో కలిసి సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని 11 రోడ్లకు, 5 బ్రిడ్జీల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. భీమారం నుంచి కిష్టంపేట వరకు 23 కి. మీ రోడ్డుతో పాటు బ్రిడ్జి నిర్మాణానికి, చెన్నూరు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దుగ్నెపల్లి వరకు 6 కి.మీల రోడ్డుతోపాటు బ్రిడ్జి నిర్మాణానికి, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి చింతపల్లి వరకు 4 కి.మీ.ల రోడ్డుతోపాటు బ్రిడ్జి నిర్మాణం కోసం, స్టేట్‌హైవే రోడ్డు పులి మడుగు నుంచి ఏసీసీ వరకు 8 కి.మీ రోడ్డుతోపాటు బ్రిడ్జి నిర్మాణానికి, జడ్‌పీ రోడ్డు సండ్రోన్‌పల్లి నుంచి మందమర్రి వరకు 6 కి.మీటర్‌ల రోడ్డుతోపాటు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పొన్నారం వరకు 16 కిలో మీటర్ల రోడ్డు, నేషనల్ హైవే 63 నుంచి గుడిపల్లి వరకు 7 కిలో మీటర్ల రోడ్డు కోసం, మందమర్రి నుంచి ఆవడం వరకు 15 కిలో మీటర్ల రోడ్డుకు, ఆరెపల్లి నుంచి సుద్దాల వరకు 8 కిలో మీటర్ల రోడ్డుకు, బూరుగుపల్లి నుంచి ధర్మారం వరకు 7 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గెర్రెగూడెం వరకు 3 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలని కోరారు. 11 రోడ్లతోపాటు బ్రిడ్జి నిర్మాణాల వల్ల చెన్నూరు నియోజకవర్గంలోని ప్రజలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఇందుకు గాను మంత్రి సానుకూలంగా స్పందించారని త్వరలో నిధుల విడుదల కోసం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సుమన్ పేర్కొన్నారు. సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ రమేష్, ఈఈ ప్రకాష్‌జాదవ్, డీఈ స్వామి రెడ్డి, ఏఈ రాజమౌళితోపాటు పలువురు పాల్గొన్నారు.

చలో ట్యాంక్‌బండ్ విజయవంతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎన్ని నిర్బంధాలు ఎదురైనా చలో ట్యాంక్‌బండ్ విజయవంతం చేశామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన తామిచ్చిన చలో ట్యాంక్‌బండ్ పిలుపునకు మద్దతిచ్చి సహకరించిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలకు కృతజ్ఞతలు చెబుతున్నానని అన్నారు. శనివారం నాటి కార్యక్రమంలో మహిళా కండక్టర్ల పాత్ర కీలకమని ప్రశంసించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు శిరసు వంచి వందనాలు చెబుతున్నానని అన్నారు. సమ్మె విజయవంతం అయ్యే వరకు మహిళలు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. చలో ట్యాంక్‌బండ్ సందర్భంగా పోలీసులు అనుసరించిన దమన కాండను తీవ్రంగా ఖండించారు. పోలీసులు దమనకాండకు నిరసనగా ఆదివారం నల్ల బ్యాడ్జీలతో బస్ డిపోల ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతామని చెప్పారు. ఆదివారం ఉదయం జేఏసీ సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు.

సీపీ వ్యాఖ్యలు బాధించాయి

హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వ్యాఖ్యలు తనను బాధించాయని అశ్వత్థామరెడ్డి అన్నారు. ఆర్టీసీ కార్మికులు నిషేధిత మావోయిస్టు సంఘాలతో చేతులు కలిపారంటూ చేసిన వ్యాఖ్య లు తప్పన్నారు. మావోయిస్టు సంగాలతో సంబంధాలు ఉన్నందునే చలో ట్యాంక్‌బండ్‌కు అను మతి ఇవ్వలేదని సీపీ పేర్కొ నడం దారుణమన్నారు. మావోయిస్టులు ఉన్నారం టూ అనవసర ఆరోపణలు చేసి సమ్మెపై ఉక్కు పాదం మోపాలని చూస్తున్నారని మండిపడ్డారు. సమ్మెలో పాల్గొంటున్న వారంతా కార్మికు లేనని, వారి కుటుంబసభ్యులని తెలుసుకోవాలన్నారు. చలో ట్యాంక్‌బండ్ కార్యక్రమం లోనూ కార్మికులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు మాత్రమే పాల్గొన్నాయన్నారు.

స్వేచ్ఛను అణచివేస్తున్న తెరాస సర్కార్

- ప్రభుత్వంపై కాంగ్రెస్ ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అణిచి వేస్తోందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏ చిన్న నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చినా.. పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ఆర్టీసీ జేఏసీ ఇచ్చిన ఛలో ట్యాంక్‌బండ్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు చేసిన లాఠీచార్జీ, అక్రమ అరెస్టులు, భవిష్యత్ కార్యాచరణకై కాంగ్రెస్ ముఖ్య నేతలు శనివారం సాయంత్రం సమావేశం అయ్యారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనరసింహ, కేంద్ర మాజీ మంత్రి బలరామ్ నాయక్, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి. హనుమంతరావు, ఏఐసీసీ కార్యదర్శులు సంపత్‌కుమార్, వంశీచందర్‌రెడ్డి, టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ పొన్నం ప్రభాకర్, జెట్టి కుసుమకుమార్ తదిరులు పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మికుల అరెస్టు, పోలీసుల చేసిన లాఠీచార్జీలను ఖండించారు.గాయపడిన వారికి ప్రభుత్వమే పూర్తిగా వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణకై ఆదివారం మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించారు. భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ చిన్న కార్యక్రమం చేపట్టినా కాంగ్రెస్ నాయకుల ఇళ్లను పోలీసులు దిగ్బంధం చేస్తున్నారని అన్నారు. నాయకులు బయటికి వెళ్లకుండా అడ్డుకుని భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.

యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం ఇవ్వాలి

- తక్కువ ఖర్చుతో వరి పొలంలో కలుపు మొక్కలను తీసే యంత్రాన్ని తీసుకురావడం అభినందనీయం
- మంత్రి కేటీ రామారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : యువతలో దాగున్న సృజనాత్మకత శక్తిని బయటకు తీయడమే ఇన్నోవేటర్ సంస్థ మరింత కృషి చేయాలని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. తక్కువ ఖర్చుతో వరి పంటలోని కలుపును తీసే యంత్రాన్ని కనిపెట్టిన యువ ఆవిష్కర్త అశోక్‌ను మంత్రి కేటీఆర్ అభినందించారు. యువ ఆవిష్కర్తకు అన్ని విధాలుగా పూర్తి సహకారం అందించాలని ఇన్నోవేషన్ ఆఫీసర్ ఫనీంద్ర సామకు మంత్రి కేటీఆర్ సూచించారు. శనివారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను ఎన్నోవేషన్ చీఫ్ ఫనీంద్ర, యువ ఆవిష్కర్త అశోక్ కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఈ ఇన్నోవేటర్ పరికరం ద్వారా వరి పోలంలోని పెద్ద కలుపు మొక్కలను సులభంగా తొలగించడానికి సహాయపడుతోందని, తద్వారా వ్యవసాయ పనులు చేసేమహిళలకు శ్రమ తప్పుతుందన్నారు. సూర్యాపేట జిల్లాకు చెందిన అశోక్ 17 ఏళ్ల యువకుడని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగాల ఉత్పత్తులపై కొలకత్తాలో జరిగిన సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ -2019 స్టూడెంట్స్ ఇంజనీరింగ్ మోడలలో మొదటి బహుమతి లభించడం అభినందనీయమని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్టా మధు తదితరులు పాల్గొన్నారు. కాగా యువ ఆవిష్కర్త ఇంటర్మీడియట్ చదువుతూనే దేవరకొండ ఒకేషనల్ కాలేజీలో ఒకేషనల్ అగ్రికల్చర్ కోర్సును అభ్యసిస్తున్నాడు. చిన్న రైతుల సమస్యలు పరిష్కించేందుకు గాను మరిన్ని ఆవిష్కరణలు చేయడమే లక్ష్యంగా అశోక్ పని చేస్తున్నారని ఇన్నోవేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. వరిలో ఉండే కలుపు మొక్కలు తొలగించడానికి మహిళలు పొలంలో వంగి పని చేయాల్సి ఉంటుందని, ఆ శ్రమ నుంచి మహిళలకు ఉపశమనం కలించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. యువ ఆవిష్కర్త అయిన అశోక్ ఇప్పటి వరకు మూడు ఆవిష్కరణలు చేశారని తెలిపారు.

టీవీ కార్మికులకు బీమా సౌకర్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగు టెలివిజన్ రంగ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. తెలుగు టెవిజన్ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా టీవీ కళాకారులకు అవగాహన కల్పించాలని మంత్రి వారికి సూచించారు. ఈనెల 19న ఎఫ్‌డీసీ, సాంస్కృతికశాఖ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి టీవీ కళాకారులకు ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డులు, గుర్తింపు కార్డుల మంజూరు వంటి అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టెలివిజన్ రంగాన్ని ఎఫ్‌డీసీ పరిధిలోకి తేవాలని, టీవీ కళాకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వపరంగా టీవీ కళాకారులకు కూడా గుర్తింపు అవార్డులు అందించాలని కోరారు.మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌బాల, ప్రధాన కార్యదర్శి విజయ్ యాదవ్, కోశాధికారి చెన్నపాటి సుబ్బారావు తదితరలు పాల్గొన్నారు.

తాత్కాలిక డ్రైవర్లకు శిక్షణ ఇవ్వండి

హైదరాబాద్, ఆంధ్రప్రభ ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా విధుల్లోకి తీసుకున్న తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లకు 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో మరో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ప్రజా రవాణా బస్సులను నడుపుతున్న తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల కు ఎలాంటి శిక్షణ, నైపుణ్యం లేని కారణంగా రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయని పేర్కొంటూ హైదరాబాద్ కు చెందిన న్యాయవాది గోపాలకృష్ణ కళానిధి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు.

ఆగివున్న బస్సులో హఠాత్తుగా మంటలు

హైదరాబాద్, ప్రభ న్యూస్ : కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రశాంతి నగర్ జీహెచ్ఎంసీ ట్రక్ పార్కింగ్ స్థలంలో ఆగి ఉన్న బస్సులో హఠాత్తుగా మంటలు చెలరేగా యి.దీంతో బీవీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. కొంత కాలంగా ఈ పాత బస్సు అక్కడేపార్క్ చేసి వుంది.శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది.

ఫారం- ఎ

బహిరంగ ప్రకటన

(ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్ రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 6 క్రింద)

మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ యొక్క రుణదాతల యొక్క గమనిక కొరకు

సంబంధిత వివరాలు

1.	కార్పొరేట్ రుణగ్రహీత పేరు	మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్
2.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క స్థాపించిన తేది	ఆగస్టు 21, 1996
3.	కార్పొరేట్ రుణగ్రహీత ఏర్పాటైన / నమోదిత అథారిటీ	ఆర్‌ఓసి - హైదరాబాద్ రిజిస్ట్రేషన్ నెంబరు-054239
4.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క కార్పొరేట్ గుర్తింపు నెం. / లిమిటెడ్ లయబిలిటి గుర్తింపు నెం.	U40101TG1996PLC054239
5.	కార్పొరేట్ రుణగ్రహీత నమోదిత కార్యాలయము మరియు ప్రధాన కార్యాలయం (ఏమైనా ఉంటే) చిరునామా	మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ 405, సప్తగిరి టవర్స్, 1-10-75/1/1 నుండి 6, బేగంపేట, హైదరాబాద్-500016
6.	కార్పొరేట్ రుణగ్రహీతకు సంబంధించి ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	నవంబరు 07, 2019
7.	ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియ ముగింపు అంచనా తేది	మే 05, 2020 (రిజల్యూషన్ ప్రక్రియ ప్రారంభ తేదీ అనగా నవంబరు 07, 2019 నుండి 180 రోజులు)
8.	మధ్యంతర రిజల్యూషన్ ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తున్న ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్ యొక్క పేరు మరియు రిజిస్ట్రేషన్ నెం.	పేరు: శ్రీ రవి శంకర్ దేవరకొండ రిజిస్ట్రేషన్ నెంబరు: IBBI/IPA-001/IP-P00095/2017-2018/10195
9.	బోర్డుతో నమోదైన విధంగా మధ్యంతర రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఐఆర్‌పి) యొక్క చిరునామా మరియు ఇ-మెయిల్	శ్రీ రవి శంకర్ దేవరకొండ, డి 602, ప్రెస్టీజ్ సెయింట్ జాన్స్‌ఉడ్ అపార్ట్‌మెంట్స్, నెం.80, తావరకెరె మెయిన్ రోడ్డు, బెంగళూరు-560029 ఇ-మెయిల్ ఐడి: ravicacscma@icai.org
10.	మధ్యంతర రిజల్యూషన్ ప్రొఫెషనల్‌తో ఉత్తర ప్రత్యుత్తరాల కొరకు ఉపయోగించుటకు చిరునామా మరియు ఇమెయిల్	చిరునామా: శ్రీ రవి శంకర్ దేవరకొండ, సి/ఓ ఇవై రీస్ట్రక్చరింగ్ ఎల్ఎల్‌పి, ఓవల్ ఆఫీస్, 18, ఐలాబ్స్ సెంటర్, హైటెక్ సిటీ, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ - 500081 క్లెయింల కొరకు ఇమెయిల్ చిరునామా : CLAIMS.MEL@IN.EY.COM ఇతర సమాచారం కొరకు ఇమెయిల్ చిరునామా : IP.MEL@IN.EY.COM
11.	క్లెయింలు సమర్పించుటకు చివరి తేది	నవంబరు 21, 2019
12.	మధ్యంతర రిజల్యూషన్ ప్రొఫెషనల్‌చే నిర్ధారించిన, సెక్షన్ 21 యొక్క ఉపసెక్షన్ (6ఎ) యొక్క క్లాజ్ (బి) క్రింద రుణదాతల యొక్క ఏదేని తరగతులు ఉంటే	వర్తించదు
13.	తరగతిలో (ప్రతి తరగతి కొరకు మూడు పేర్లు) రుణ దాతల యొక్క అధీకృత ప్రతినిధిగా వ్యవహరించుటకు గుర్తించబడిన ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ యొక్క పేర్లు	వర్తించదు
14.	ఎ) సంబంధిత ఫారాలు మరియు బి) అధీకృత ప్రతినిధుల వివరాలు లభించు ప్రదేశం:	వెబ్‌లింక్: http://www.meenakshigroup.com/ భౌతిక చిరునామా: ఇవై రీస్ట్రక్చరింగ్ ఎల్ఎల్‌పి, ఓవల్ ఆఫీస్, 18, ఐలాబ్స్ సెంటర్, హైటెక్ సిటీ, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ - 500081

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ వారు నవంబరు 07, 2019న మెస్సర్స్ మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రక్రియ యొక్క ప్రారంభమునకు ఉత్తర్వు చేసియున్నారు.

మెస్సర్స్ మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ యొక్క రుణదాతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఎంట్రీ నెం. 10 ఎదురుగా సూచించబడిన చిరునామా వద్ద మధ్యంతర రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు నవంబరు 21, 2019న లేదా అంతకన్నా ముందు రుజువుతో వారి క్లెయింలను సమర్పించవలసినదిగా కోరడమైనది.

ఆర్థిక రుణదాతలు వారి రుజువుతో వారి క్లెయింలను ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా మాత్రమే చేయవలెను. ఇతర రుణదాతలందరు రుజువుతో వారికి క్లెయింలను స్వయంగా, పోస్టుద్వారా లేదా ఎలక్ట్రానిక్ పద్ధతుల ద్వారా చేయవచ్చును.

ఎంట్రీ నెం. 12 ఎదురుగా సూచించిన జాబితాలో గల విధంగా తరగతికి చెందిన ఆర్థిక రుణదాత ఫారం సిఎ లో తరగతి యొక్క అధీకృత ప్రతినిధిగా వ్యవహరించుటకు ఎంట్రీ నెం. 13పై జాబితాలో గల ముగ్గురు ఇన్‌సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ నుండి అధీకృత ప్రతినిధిచే దాని ఎంపికను సూచించవలెను.

క్లెయింల యొక్క అసంబద్ధమైన లేదా తప్పుదోవ పట్టించే రుజువుల యొక్క సమర్పణ అపరాధం విధించుటకు దారితీస్తుంది.

సం/- శ్రీ రవి శంకర్ దేవరకొండ
మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ యొక్క మధ్యంతర రిజల్యూషన్ ప్రొఫెషనల్
రిజిస్ట్రేషన్ నెంబరు:
IBBI/IPA-001/IP-P00095/2017-2018/10195

తేది : 10.11.2019
ప్రదేశం: హైదరాబాద్.